సీఎం నిలదీత.. మంత్రుల అడ్డగింత

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. 'వరద నీటిలో చిక్కుకొని రెండు రోజులుగా నరకం అనుభవిస్తే ప్రభుత్వం నుంచి ఒక్కరు కూడా వచ్చి ఆదుకోలేదని, అన్నపానీయాలు లేకుండా మగ్గిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడొచ్చి రూ. 10 వేలు ఇస్తామని ప్రకటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాకు ఈ ప్రకటనలు, హామీలు వద్దు.. సాయం చేయండి' అంటూ డిమాండ్ చేశారు. భారీ వర్షాల కారణంగా శని, ఆదివారాల్లో ఖమ్మంలోని మున్నేరు మహోగ్రరూపం దాల్చి పరీవాహక ప్రాంతాలను ముంచేసింది. వరద నీటిలో చిక్కుకొని నరకం చూసిన ప్రజలను పరామర్శించేందుకు, జరిగిన నష్ట తీవ్రతను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఖమ్మం వచ్చారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసాలు నీటమునిగిన ప్రాంతాలకు వెళ్లి బాధితుల బాగోగుల గురించి అడిగి తెలుసుకోబోయారు. ఈ క్రమంలో రెండు రోజులుగా ఆచూకీలేని ప్రభుత్వ పెద్దలు సోమవారం పరామర్శకు రావడంపై బాధితులు భగ్గుమన్నారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో మహిళలు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి ఎదుటే ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖమ్మం నగరంలో ఆయన పర్యటనను నిరసిస్తూ వ్యర్థాలను రోడ్డుపై పోయించి నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా తాము జల ప్రళయంలో చిక్కుకున్నా తమను ఎవరూ పట్టించుకోలేదన్న విషయాన్ని సీఎంకు చెప్పేందుకు వెళ్తున్న పలువురు మహిళలను మగ పోలీసులు లాగిపడేశారు.

ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డ ప్రాంతంలో పారిశుధ్య సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న వ్యర్థాలను రోడ్డుపై పోయించి నిరసన వ్యక్తం చేస్తున్న వరద బాధితులు

ఖమ్మం పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్నేరును పరిశీలించి వెళుతుండగా అడ్డుకుంటున్న గ్రామస్థులు

పోలేపల్లిలో సీఎంకు నిరసన సెగ

వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డికి నిరసన ఎదురైంది.

మండలంలోని పోలేపల్లి రాజీవ్ గృహకల్ప కాలనీలో సీఎం పర్యటిస్తున్న సమయంలో స్థానికులు అడుగడుగునా అడ్డుతగిలారు. మంత్రి పొంగులేటి తమ కాలనీకి వచ్చి తమ కష్టాన్ని చూడాలంటూ ఉదయం 8 గంటల సమయంలో ఖమ్మం బైపాస్‌పై సుమారు రెండు గంటలపాటు రాస్తారోకో చేశారు. పర్యటనలో భాగంగా సాయంత్రం ఐదు గంటలకు రేవంత్ అదే కాలనీకి వెళ్లాల్సి ఉంది. దీంతో కాలినడకన వచ్చిన తమ ఇండ్లలోని పరిస్థితిని చూస్తారని కాలనీవాసులు ఆశపడ్డారు. కానీ సీఎం కాలినడక కాకుండా ఓపెన్‌టాప్ జీప్‌లో వచ్చారు. దీంతో ఆగ్రహించిన కాలనీవాసులు నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి కారులో ఉండి హాయ్ చెప్పడానికి ఇక్కడకు వచ్చారా? అని మండిపడ్డారు. జీప్ దిగివచ్చి తమ ఇబ్బందులను చూడాలని నినాదాలు చేశారు. కాలనీలో దాదాపు 15 నిమిషాలపాటు జీప్‌పై ఉన్న సీఎం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడాన్ని గమనించారు. కాలనీ సెంటర్‌కు వచ్చిన ఆయన అక్కడ జీప్ ఆపారు. పక్కనే ఉన్న మూతి సంతోశ్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లారు. ఇంటి పరిసరాలను చూసి తిరిగి వచ్చి జీప్ ఎక్కబోయారు. ఆ సమయంలో ఓ వ్యక్తి సీఎం జీప్‌కు అడ్డంగా వచ్చి కింద పడుకునే ప్రయత్నం చేశాడు. ఈలోపే సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడుకున్నారు. దీంతో ముఖ్యమంత్రి మైక్ తీసుకొని మాట్లాడారు. సీఎం ప్రసంగం ఆరంభం మొదలుకాగానే కాలనీవాసులు నినాదాలు చేశారు. 'ప్రచారం వద్దు.. సాయం చేయండి' అంటూ నినదించారు. 'ఇంటికి రూ.పది వేల పరిహారం ఇస్తాం' అని చెప్పే సమయంలో అన్ని వైపుల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'మీరు ఇచ్చే రూ. పది వేలకు ఒక్క సామాను కూడా రాదు.. మీ 10 వేలు వద్దు.. మీరు వద్దు..' అంటూ చేతులు ఎత్తి నినాదాలు చేశారు. రెండ్రోజులుగా నీళ్లలోనే ఉన్నప్పటికీ తమను పట్టించుకున్న వారే లేరని చెప్పడానికి సీఎం వద్దకు వెళ్తుండగా పోలీసులు పోలేపల్లి కాలనీ మహిళలను పక్కకు తప్పించారు. సీఎం పర్యటనకు కొద్ది గంటల ముందు మున్సిపల్ అధికారులు ఖమ్మంలోని బొక్కలగడ్డ ప్రాంతంలోని చెత్తను ట్రాక్టర్ల ద్వారా తొలగించి బ్లీచింగ్ చల్లారు. రెండు రోజులుగా తమ ఇబ్బందులను పట్టించుకోని అధికారులు ఇప్పుడొచ్చి శుభ్రం చేస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నిరసనకు సీఎంకు తెలియజేసేలా ఆ ట్రాక్టర్లలోని వ్యర్థాలను అక్కడి రోడ్డుపై పోయించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చినట్టు చేతులు ఊపుకుంటూ, టాటా చెప్పి వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం ఏమన్నా నీ ఇంటికి వచ్చి కలుస్తాడా?

మీడియాతో బాధలు చెప్పుకుంటున్న వరద బాధితులను కాంగ్రెస్ నాయకుడు మోసిన్‌ఖాన్ బెదిరించారు. ఖమ్మం కాంగ్రెస్ అడ్డా అని, ఇక్కడికి వచ్చి ఏం మాట్లాడుతున్నారని హెచ్చరించారు. సీఎం ఏమన్నా నీ ఇంటికి వచ్చి కలుస్తాడా అంటూ మండిపడ్డారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. వరద బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మీడియా ప్రతినిధులను కూడా బెదిరించారు.

వరద బాధితుల ఆర్తనాదాలు

హుజూర్‌నగర్, కోదాడలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆయన సతీమణి, ఎమ్మెల్యే పద్మావతి పర్యటించగా బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురంలో 50 మందికిపైగా వరద బాధితులు సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

నిత్యం సమస్యలతో సతమతమవుతున్నామని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట తలోడి గ్రామస్థులు ధర్నా చేశారు. సమస్యలపై పలుమార్లు కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీవో మహేందర్ రెడ్డి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

> 'రేవంత్‌రెడ్డికి దోమలు కుడతాయని బ్లీచింగ్ చల్లుతున్నారా? మేం చచ్చినా పర్లేదా? మూడ్రోజుల నుంచి తిండి, నీళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్నాం'
> -ఖమ్మంలో వరద బాధితులు

తహసీల్దార్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

తాగు నీటి సమస్య పరిష్కరించాలని విర్దండి గ్రామంలో సోమవారం తహసీల్దార్ పుష్పలత కారును ఎస్సీ కాలనీ వాసులు అడ్డుకున్నారు. కలెక్టర్ పర్యటన అనంతరం తహసీల్దార్ విర్దండి నుంచి కౌటాలకు వచ్చే క్రమంలో గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు ఆమె కారును అడ్డుకున్నారు.

మణుగూరులో బస్తీ వాసుల బైఠాయింపు

మణుగూరు టౌన్: భారీ వర్షంతో తమ కాలనీ ముంపునకు గురైతే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ఆరోపిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని మేదర బస్తీవాసులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కనీసం మున్సిపల్ సిబ్బంది, కమిషనర్ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అరగంటకు పైగా నినాదాలు చేశారు. ఓట్ల సమయంలో వచ్చి పలకరించిన ఎమ్మెల్యే బాధల్లో ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆందోళనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై మేడ ప్రసాద్ అక్కడికి చేరుకుని కాలనీవాసులకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

అధైర్య పడొద్దు.. ప్రభుత్వం ఆదుకుంటుంది

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఇళ్లల్లోకి నీళ్లొచ్చి, ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులైన వారు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ భరోసా కల్పించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, మహబూబాబాద్, గంగారం మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆమె స్థానిక ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి పర్యటించారు. కేసముద్రం, ఇనుగుర్తి, గంగారం మండల కేంద్రాలు, నెల్లికుదురు మండలం రావిరాల గ్రామం, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీలను సందర్శించారు. వరద బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కూలిన ఇళ్లను, తడిసిన నిత్యావసర సరుకులు, తెగిన చెరవులు, వరదలో కొట్టుకపోయిన మూగజీవాలను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

దండం పెడతా.. ఆదుకోండి

బయ్యారం: 'రెండు రోజులుగా కురిసిన వర్షం కారణంగా వరదలో వరి పంట కొట్టుకుపోయింది. నష్టం వచ్చింది. దండం పెడతా ఆదుకోండి' అంటూ మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం అల్లిగూడెం గ్రామానికి చెందిన రైతు కోడి మల్లేశ్ మంత్రి సీతక్క ఎదుట కన్నీరు పెట్టుకున్నాడు. వారం క్రితమే ఐదెకరాల్లో వరి పంట వేశానని, వరదతో పంట మొత్తం దెబ్బతిందంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలుపుతూ 'దండం పెడతా ఆదుకోండి' అంటూ కన్నీరు పెడుతూ వేడుకున్నాడు. బాధ పడొద్దని రైతుకు ధైర్యం చెప్పిన మంత్రి సీతక్క పంట నష్టాన్ని అంచానా వేయాలని తహసీల్దార్ విజయను ఆదేశించారు.

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం అల్లిగూడెం గ్రామంలో తమను ఆదుకోవాలంటూ మంత్రి సీతక్కకు దండం పెడుతున్న రైతు మల్లేశ్

మంత్రి సీతక్క కాన్వాయ్‌ని అడ్డుకున్న తండావాసులు

కేసముద్రం/ఇనుగుర్తి/నెల్లికుదురు/మహబూబాబాద్ రూరల్/గంగారం : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని కట్టతండా వాసులు సోమవారం మంత్రి సీతక్క కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ముంపునకు గురైన పలు మండలాల్లోని గ్రామాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కేసముద్రం వచ్చిన మంత్రిని తమ ప్రాంతానికి రావాలని తండావాసులు కోరినప్పటికీ పట్టించుకోకపోవడంతో మంత్రి కాన్వాయికి అడ్డుతగిలారు. పోలీసులు వెంటనే అక్కడికి వచ్చి వారిని బలవంతంగా పక్కకు నెట్టివేయడంతో కాన్వాయి వెళ్లిపోయింది.

మంత్రి పొంగులేటి వచ్చి వరద తీవ్రతను పరిశీలించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం బైపాస్‌పై బైఠాయించిన రాజీవ్ స్వగృహ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీవాసులు

పొంగులేటి వస్తేనే నిరసన విరమణ

ఖమ్మం రూరల్: తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్నది పాలన ప్రజాపాలన కాదని, ప్రజావ్యతిరేక పాలనని ఖమ్మంలోని రాజీవ్ స్వగృహ, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీల వాసులు ఆరోపించారు. మున్నేరు ముంపునకు గురైన తాము నీటిలో రెండు రోజులుగా అరిగోస పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం నుంచి ఇసుమంతైనా సాయం అందలేదని అన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చి తమ కాలనీలను పరిశీలించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బైపాస్ రోడ్డుపై సోమవారం రాస్తారోకో చేశారు. దాదాపు 500 మంది కాలనీవాసులు రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి పొంగులేటి తమ కాలనీలకు వచ్చి పరిశీలిస్తేనే తాము ఈ ఆందోళనను విరమిస్తామని, లేదంటే ఇక్కడినుంచి కదలబోమని మహిళలు స్పష్టం చేశారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా తమను నిండా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పొంగులేటి రాబోతున్నారని తెలుసుకున్న పోలీసులు నిరసన కారులపై విరుచుకుపడ్డారు. రాస్తారోకోను భగ్నం చేసేందుకు యత్నించారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న మంత్రి పొంగులేటిపై ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. 'అందరూ చచ్చాక వస్తే ఇంకా బాగుండేది కదా..' అంటూ నినాదాలు చేశారు. తమకు పూర్తి న్యాయం చేయకపోతే మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని డిమాండ్ చేశారు.

మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగు ఉధృతికి ధ్వంసమైన ఎన్‌హెచ్-365

5700 గ్రామాల్లో నీటి సరఫరా బంద్

- 600 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న పీఆర్ రోడ్లు
- కొట్టుకుపోయిన 150 ప్రధాన రహదారులు
- రోడ్ల మరమ్మతులకు 1000 కోట్లు అవసరం
- ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో భారీ నష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వర్షాలు,వరదలతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. 9 నెలలుగా మరమ్మతుకు నోచుకోని రోడ్లు వర్షాలతో 150ప్రాంతాల్లో కొట్టుకుపోయినట్టు, 500 రోడ్లు భారీగా దెబ్బతిన్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటి మరమ్మతులకు సుమారు రూ. 600 కోట్ల వరకు అవసరమవుతాయని అధికారులు తెలిపారు. 117 గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతినడం వల్ల 80 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో 600 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని, వీటి మరమ్మతుకు రూ.421 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

బకాయిలు పెండింగ్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి రోడ్ల పునరుద్ధరణ పనులు జరగలేదు. తాత్కాలిక మరమ్మతు పనులు సైతం నిధుల కొరత పేరుతో అరకొరగా పూర్తిచేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో పునరుద్ధరణ పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. సుమారు రూ. 800 కోట్ల వరకు కాంట్రాక్టర్ల బకాయిలు పెండింగులో ఉన్నట్టు సమాచారం.

నిలిచిన నీటి సరఫరా

భారీ వర్షాలు, వరదల వల్ల 5,700 గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ సబ్‌స్టేషన్లలోకి నీరు చేరడంతో విద్యుత్తు నిలిపివేసిన కారణంగా పలు గ్రామాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నీటి పంపింగ్‌కి అవసరమైన విద్యుత్తు లేక 5700 ఆవాస గ్రామాలకు, వరదల వల్ల 1400 చోట్ల మిషన్ భగీరథ పైపులు దెబ్బతిన్నాయి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో తాగు నీటిని సరఫరా చేసిందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు వేల ఆవాసాల్లో మిషన్ భగీరథ సబ్ స్టేషన్లను పునరుద్ధరించి నీటి సరఫరా చేశారు.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం ఇసోజిపేట శివారులో తెగిపోయిన కాలువ

రెండు రాష్ట్రాలకు వెంకయ్యనాయుడు విరాళం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : తెలుగు రాష్ట్రాల్లో వరద కష్టాలపై మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విచారం వ్యక్తంచేశారు. తన వ్యక్తిగత పెన్షన్ నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధులకు రూ.5 లక్షల చొప్పున సాయం అందించినట్టు సోమవారం ఆయన ప్రకటించారు. ప్రధాని మోదీకి ఫోన్‌చేసి తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితిని వివరించగా, రెండు రాష్ట్రాలకు సహాయ సహకారాలు అందజేస్తామని ప్రధాని హామీ ఇచ్చినట్టు చెప్పారు. తన కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరపున ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు అందజేసినట్టు వెల్లడించారు. తన కుమార్తె దీపావెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణ భారత్ ట్రస్ట్ నుంచి ఏపీ సీఎం సహాయ నిధికి రూ. 2.5 లక్షలు, తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.2.5 లక్షలు అందజేసినట్టు వెంకయ్యనాయుడు తెలిపారు.

వరద సహాయ చర్యల్లో పాల్గొందాం: జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులంతా సహాయ, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపునిచ్చింది. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావులు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.పనిగంటలతో సంబంధం లేకుండా నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలకు భరోసానివ్వాలని కోరారు.

విజయవాడ హైవేపై రాకపోకల పునరుద్ధరణ

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 2 : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి 65పై నందిగామ వద్ద వరద ఉధృతి తగ్గముఖం పట్టడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగుతాయని సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం తెలిపారు. గరికపాడు వద్ద పాత బ్రిడ్జి ధ్వంసమైనందున వాహనాలను కొత్త బ్రిడ్జిపై నుంచి మాత్రమే పంపిస్తున్నారని పేర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణికులు గమనించి బ్రిడ్జిపై నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

తక్షణ సాయం 10 వేలు

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు
- పశువులకు 50 వేలు, గొర్రెలు, మేకలకు 5వేలు
- పంట నష్టం ఎకరాకు రూ.10 వేలు
- 2వేల కోట్ల తక్షణ సాయం కోసం కేంద్రానికి వినతి : సీఎం రేవంత్‌రెడ్డి
- సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో పర్యటన

ఖమ్మం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) సూర్యాపేట, /మామిళ్లగూడెం, సెప్టెంబర్ 2: వరద బాధితులకు తక్షణ సహాయం కింద ప్రతి కుటుంబానికి రూ.10వేలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున, పశువులకు రూ.50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.5వేలు, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారు. రెండు రోజుల్లో మున్సిపల్,రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి, నష్టాన్ని అంచనావేసి పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డితోకలిసి సోమవారం సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా, మంచికంటినగర్‌లో బాధితులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ మున్నేరు వరదలో చిక్కుకొని సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

సూర్యాపేటలో సమీక్ష

అంతకుముందు సీఎం మార్గమధ్యంలో సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో ఆగారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి వరద పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.సాగర్ ఎడమ కాల్వ తెగడం వల్ల జరిగిన పంట నష్టంపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అన్నారు. తక్షణ సాయంగా కలెక్టర్‌కు రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఈ రెండు జిల్లాల్లో సీఎం పర్యటనకు అడుగడుగునా నిరసన వ్యక్తమైంది.

మూడు రోజులుగా నిద్రలేదు!

రాష్ట్రంలో వర్షాలు,వరద పరిస్థితిపై మూడు రోజులుగా నిద్ర లేకుండా సమీక్ష చేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో రూ. 5వేల కోట్లు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని, కేంద్రం తక్షణం రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని కోరుతున్నామని అన్నారు. వరద పరిస్థితిపై ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాతోపాటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి వివరించి సాయం కోరానని తెలిపారు. సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు అందిస్తే ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వానికి సహకారం అందించాలని కోరారు.

పరిశీలనకు రావాలని ప్రధానికి వినతి

వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు రావాలని ప్రధానిని కోరుతూ లేఖ రాయాలని సీఎస్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలు ఏర్పాటుచేసి 24 గంటలు పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి మూడు గంటలకో బులెటిన్ విడుదల చేయాలని సూచించారు.

పోలీసులకు ఎన్‌డీఆర్ఎఫ్ తరహా శిక్షణ

రాష్ట్రంలోని 8 బెటాలియన్లలో మూడొవంతు యువ పోలీసులకు ఎన్‌డీఆర్ఎఫ్ తరహాలో శిక్షణ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని ఆదేశించారు. 25 పెద్ద టవర్లు కూలిపోయినా విద్యుత్తు సిబ్బంది వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించారని అభినందించారు. కూలీలను గుర్తించి నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని ఆదేశించారు.

నిజామాబాద్ జిల్లా సిరికొండ శివారులో బైక్‌పై వాగు దాటే క్రమంలో కొట్టుకుపోతున్న నారాయణ

రంగారెడ్డి జిల్లా పరిధి మోకిలలో పెద్దఎత్తున వరద నీరు చేరడంతో ముంపునకు గురైన విల్లాలు

జలదిగ్బంధంలో ఆరు కోట్ల విల్లా

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం, మోకిలలోని విల్లాల్లోకి భారీగా వరద నీరు చేరింది. సుమారు 200 విల్లాలు ఉన్న గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్టులోకి పెద్దఎత్తున నీరు వచ్చింది. వరద ప్రవాహానికి అడ్డుగా ఈ విల్లాలు నిర్మించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లే వీలులేకపోవడంతోనే విల్లాల్లోకి నీరు చేరిందని, ప్రతియేటా వానకాలంలో ఇది సర్వసాధారమైందని పేర్కొంటున్నారు. సుమారు రూ.6 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన విల్లాలు నీట మునగడంతో బాధితుల బాధ వర్ణనాతీతంగా మారింది. ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో విల్లాల్లోకి వరద రాకుండా చర్యలు తీసుకోవాలని విల్లాలవాసులు కోరుతున్నారు.

25 లక్షల ఎకరాల్లో పంట నష్టం!

- వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షాలతో దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వానలు కొనసాగుతుండటంతో నష్టం పెరిగే అవకాశం ఉన్నదన్న అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక నివేదికల ప్రకారం దాదాపు 12-15 లక్షల ఎకరాల పత్తి ,10 లక్షల ఎకరాల్లో వరి, 3 లక్షల ఎకరాల్లో మక్కజొన్నతోపాటు ఇతర పంటలు దెబ్బతిన్నట్టుగా అధికారులు లెక్కలు వేస్తున్నారు.

జిల్లాల్లో పరిస్థితి ఇలా..

సూర్యాపేట జిల్లాలోని 19,696 ఎకరాల్లో, నల్లగొండ జిల్లాలోని ఆరు మండలాల్లోని 14 గ్రామాల పరిధిలో 648 ఎకరాల పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. రంగారెడ్డి జిల్లాలో పంట పొలాలు నీట మునగడంతో వేల ఎకరాల్లో నష్టం జరిగింది. మొయినాబాద్ మండలంలోని అండాపూర్ వద్ద ఈసీ వాగు పంట పొలాల నుంచి పారడంతో సుమారు 100 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వికారాబాద్ జిల్లాలో 1056 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1.5 లక్షల ఎకరాల్లో, సంగారెడ్డి జిల్లాలో 623 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

మహబూబాబాద్ పట్టణ శివారులోని మున్నేరువాగు ఉధృతికి నేలవాలిన వరిపంట